క్లుప్తంగా

డీఎస్పీగా మౌనిక ఎంపిక



ములుగు రూరల్: గ్రూపు 1 ఫలితాల్లో మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన అల్లెపు మౌనిక ప్రతిభ కనబర్చి డీఎస్పీగా ఎంపికయ్యారు. దీంతో గురువారం మల్లంపల్లిలో ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లంపల్లి గ్రామానికి చెందిన సరోజన–సమ్మయ్య దంపతుల కుమార్తె డీఎస్పీ ఉద్యోగం సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, చీదర సంతోష్, మొర్రి రాజుయాదవ్, కానుగంటి సతీష్, రవి, సంపత్, అనిల్‌రెడ్డి, సంతోష్, మధు, వేణు తదితరులు పాల్గొన్నారు.

గాలి వానకు ఎగిరిపోయిన రేకులు



వాజేడు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రాత్రి కనకయ్య ఇంటిపై వేసిన సిమెంట్ రేకులు ఎగిరిపోయినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. గాలి, వానకు రేకులు కింద పడి ముక్కలు ముక్కలుగా విరిగి పోయినట్లు తెలిపారు.

రోడ్డుపై కూలిన చెట్టు

పలిమెల: కురుస్తున్న వర్షానికి మండలంలోని పంకెన రామలక్ష్మణుల చెట్ల సమీపంలో గురువారం మధ్యాహ్నం భారీ చెట్టు కూలి రోడ్డుపై పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా వర్షం పడుతుండటంతో అధికారులు ఆ వృక్షాన్ని తొలగించలేదు. గమనించకుండా ఎవరైనా వేగంగా వస్తే ప్రమాదం జరిగే అస్కారం ఉంది. అధికారులు వెంటనే చెట్టును తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి


ఏటూరునాగారం: వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో మరో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటూరునాగారంలో ఉన్న డయాలసిస్ కేంద్రాలు రోగులకు సరిపోవడం లేదని, మరోక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్, కూనూర్ అశోక్ గౌడ్, కాకులమర్రి ప్రదీప్ రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



మొగుళ్లపల్లి: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని రంగాపురం గ్రామంలో ఎల్లమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ దేవతల ఆలయాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ దేవాలయాల పునరుద్దరణ, నూతన ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ రఫీ, మాజీ వైస్ ఎంపీపీ పోలినేని రాజేశ్వరావు, నాయకులు తక్కళ్లపల్లి రాజు, ఆకుతోట కుమారస్వామి, కత్తి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



కాటారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న చెప్యాల సుజాత డాక్టరేట్ పొందారు. సుజాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సుజాత యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆంగ్ల ఆధునిక బోధన పద్ధతుల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 'ఏ స్టడి ఆన్ ది ఇన్ఫ్లుయేన్స్ ఆఫ్ డిస్కర్స్ ఓరియంటల్ పెడగగి ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఆఫ్ సెకండరీ లెవల్' అనే అంశంపై ఆచార్య చంద్రకళ ఆధ్వర్యంలో ఆచార్య మేరి సునంద మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి తన పరిశోధన పత్రాన్ని ఎక్జామినర్ అహ్మద్ పటేల్ సమక్షంలో ఆచార్య ముష్తాఖ్‌కు సమర్పించారు. దీంతో సుజాతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. తనకు సహకరించిన తన కుటుంబ సభ్యులు, ఆచార్యులు, తోటి ఉపాధ్యాయులకు, ఈఎల్‌టీఏ సభ్యులకు సుజాత కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ పట్టా అందుకున్న సుజాతను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బుట్టాయిగూడెం వద్ద నీట మునిగిన వరిపొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న దయ్యాలవాగు



పొంగిపొర్లుతున్న వాగులు

- రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- ఏజెన్సీ గ్రామాలకు నిలిచిన రాకపోకలు



బుట్టాయిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హనుమంతుని వాగు

కన్నాయిగూడెం: మండలంలో రెండు రోజుల నుంచి వర్షలు కురుస్తున్నాయి. రాత్రి పగలు తెడాలేకుండా భారీ వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో పంట పొలాలు నీటి మునిగిపోయాయి. వాటితో పాటు మండలంలోని ఏజెన్సీ గ్రామాలు సర్వాయి, ఐలాపుర్‌కు మేడాగు, మల్కపల్లి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తుపాకులగూడెం ఏటూరునాగారం ప్రధాన రహదారిపై కంతనపల్లి పరిధిలోని దొంగలగుట్ట వాగు లోలెవెల్ వంతెన వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో మండలానికి గ్రామాలకు, ఏటూరునాగారానికి గురువారం రాకపోకలు నిలిచిపోయాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

మండలంలో కురుస్తున్న వర్షాలతో ఐలాపుర్‌కు, సర్వాయికి బుట్టాయిగూడెం వద్ద ఉన్న మల్కపల్లి వాగు వరదలు అధికంగా చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలానికి ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ హైలెవెల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బుట్టాయిగూడెం వద్ద ఉన్న అనుమంతుని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మేడాగు, మల్కపల్లి వాగు, శుద్దవాగు, బురుదోనివాగు, మొత్తం ఏడు వాగుల కలయికతో బుట్టాయిగూడెం వద్ద కలిసి ప్రవహిస్తు గోదావరిలో కలుస్తుంది.

నీటి మునిగిన పంటలు..

మండలంలోని కురుస్తున్న వర్షాలతో మండలంలోని బుట్టాయిగూడెం, చింతగూడెం, సింగారం, ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో పంటలు వరి, మిరప పంటలు నీటమునిగి పోయాయి. అటవీ ప్రాంతం నుంచి వరదలు భారీగా వస్తుండడంతో వాగుల నుంచి వరదలు సమీప పొలాల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. రెండు రోజుల నుంచి మల్కపల్లి వాగువరదలో బుట్టాయిగూడెం వద్ద పంటపొలాలు నీటిలోనే మునిగి పోయాయి.



మల్కపల్లి వాగు వద్ద ఆగిన ప్రయాణికులు

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గురువారం ప్రేమ్ నగర్, ములుగు పరిసర ప్రాంతాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సంజీవ్ మాట్లాడుతూ.. యువత చెడు మార్గం వైపు ప్రయాణించకుండా సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, డైరెక్టర్ వెంకటరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కుమార్, అధ్యాపకులు నరేష్ తదితరులు ఉన్నారు.

పూసూరు వాసికి బ్లాక్ బెల్ట్ ప్రదానం



సుమన్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ అందుకుంటున్న సర్వేశ్వరరావు

వాజేడు: మండల పరిధిలోని పూసూరు గ్రామానికి చెందిన నల్లెబోయిన సర్వేశ్వరరావుకు సినీ హీరో సుమన్ చేతుల మీదుగా గురువారం నాల్గొవ డాన్ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేశారు. జనగామ జిల్లా పాలకుర్తిలో ఈ నెల 22 నుంచి 25 వరకు షోటోకాన్ కరాటే శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇండియా కరాటే చైర్మన్ హాస్సీన్, తెలంగాణ రాష్ట్ర కరాటే అధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రాండ్ మాస్టర్ పాయం సురేష్, సినీ హీరో సుమన్ హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కరాటే బెల్ట్‌లను ప్రదానం చేశారు.

క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేయించుకున్న వారితో వైద్య సిబ్బంది

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో గురువారం క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని చుంచుపల్లి, వాడగూడెం, మల్లూరు, నర్సింహాసాగర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు, దగ్గు, తెమడ, దమ్ము, జ్వరంతో బాధపడుతూ వారికి తెమడ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న వైద్య సిబ్బంది

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారి చిన్నపాక యమున ఆధ్వర్యంలో గురువారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి యమున సిబ్బంది, ఏఎన్ఎం, ఆశాలతో కలిసి బతుకమ్మను పేర్చారు. పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బంది ఆడుతూ పాటలు బతుకమ్మ పండుగ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, ఏఎన్ఎం సారమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బారులుదీరిన ఇసుక లారీలు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం



రోడ్డుపై నిలిచిన లారీలు

మల్హర్: మండలంలోని మల్లారం ఇసుక క్వారీ నుంచి కొయ్యూరు నాగులమ్మ వరకు ప్రధాన రహదారిపై ఇసుక లారీలు నిలిపారు. ప్రయాణికుల కోసం నిర్మించిన ప్రధాన రోడ్డు ఇసుక లారీలలో నిండిపోయింది. రూట్ మ్యాప్ లేకుండా లారీలను అనుమతించడం, వచ్చిన వాహనాలను వెంటనే లోడ్ చేయకపోవడం, ప్రధాన రహదారిపై లారీలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మల్లారం క్వారీకి నాలుగు రోజులుగా ఇసుక లోడింగ్ కోసం ప్రతీ రోజు 50 నుండి 120 లారీలు చేరుకుంటున్నాయి. పెద్దపల్లి జిల్లా అడవి సోమన్‌పల్లి క్వారీ బంద్ కావడంతో ఆ క్వారీ లారీలను సంబంధిత శాఖ అధికారులు మల్లారం క్వారీకి బదిలీ చేశారు. దీంతో గురువారం ఒక్క రోజే ఒక్కదాని వెంట మరోకటి 300 మేర లారీలు రైలు బోగీలను తలపిస్తూ మల్లారం రావులపల్లి ఇసుక క్వారీ నుంచి కొయ్యూరు నాగులమ్మ వద్దకు నాలుగు కిలోమీటర్ల మేర లారీలు బారులుదీరాయి. గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో కొయ్యూరు పోలీసులు అక్కడి చేరుకోని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా ఇసుక లోడింగ్ చేయడానికి నింబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు లారీల వద్ద నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య గురువారం తెలిపారు. మండలంలోని జమ్‌షేడ్‌బేగ్‌పేట వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్ సీజ్ చేశామన్నారు. ఈమేరకు రవికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఆర్‌అండ్‌బీ ఆఫీస్ ఎదుట రోడ్డుపై గుంతలు



గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ ఆఫీస్ ఎదుట ప్రధాన రోడ్డుపై భారి గుంతులు ఏర్పడ్డాయి. గురువారం కురిసిన వర్షాలకు గుంతలు నిండి చెరువును తలపిస్తోంది. స్థానికులు గుంతల వద్ద భారీగేడ్‌ను సూచికంగా ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు అధికారులకు కనిపించడం లేదా ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గుంతలు పూడ్చివేయాలని కోరుతున్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు: మండల కేంద్రానికి చెందిన తల్లడి నవ్యగ్నాపిక 2024–25 విద్యా సవత్సరంలో నీట్ ఎన్ట్రెన్స్ రాసి మొదటి విడతలోనే హయామత్ నగర్ లోని నోవా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. గురువారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శాలువా కప్పి సన్మానించారు. పేద విద్యార్థి కావడంతో ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి అవసరమైన పుస్తకాలను సొంత ఖర్చులతో ప్రతీ సంవత్సరం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అదే విధంగా ఆమె చదువుకు రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే విషయాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కల దృష్టికి తీసుకువెళ్లి ఆదుకునేలా చూస్తానని తెలిపారు. మాజీ జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల పూడి విక్రాంత్ తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరం పరిశీలన



మాట్లాడుతున్న క్రాంతికుమార్

మంగపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి స్వప్నిత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రి కంటి వైద్య వైద్య నిపుణులు డాక్టర్ స్రవంతి 220 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, ఈ వైద్య శిబిరాన్ని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అఖిల, మనోజ్ కుమార్, తరుణ్ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, హెచ్‌వీ పద్మ తో పాటు తదితరులలు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జవహర్



దీన్‌దయాళ్ జయంతి వేడుకల్లో నాయకులు

ములుగు రూరల్: దీన్‌దయాళ్ ఆశయ సాధనకు కృషి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జవహర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ హాజరై మాట్లాడారు. యువతకు ఆదర్శ నేత ఏకాత్మత మానవత వాది సిద్ధంతా కర్త దినదయాల్ ఉపాధ్యాయ అన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని పని చేసిన వ్యక్తి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర చారి, రమేష్, రాజ్ కుమార్, విశ్వనాథ్, రవిరెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

దీన్‌దయాళ్ స్పూర్తితో ముందుకు సాగుదాం..

రేగొండ: దీన్ దయాల్ ఉపాధ్యాయుడి స్పూర్తితో ముందుకు సాగుదామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండల రాజు పేర్కొన్నారు. గురువారం దీన్‌దయాళ్ జయంతి వేడుకలను మండల ప్రధాన కార్యదర్శి తూర్పాటి మల్లేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూధర్మ పరిరక్షణకు దీన్ దయాల్ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్‌రెడ్డి లింగారెడ్డి, సయ్యద్ గాలిఫ్, రమణారెడ్డి, రఘు, సమ్మిరెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ములుగు రూరల్‌లో..



ఏటూరునాగారం: రామాలయంలో..



అమ్మవారికి ప్రత్యేక పూజలు

దేవిశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారు గురువారం నాలుగో రోజు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(ఎం): అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గోవిందరావుపేట: కాత్యాయనీ అలంకరణలో అమ్మవారు



రాజుపేటలో..



బోరునర్సాపురంలో..



ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రాజ్‌మహ్మద్

చిట్యాల: ముస్లిం, మైనార్టీ కులాలకు రెండు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మజీ కో–ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్ మాట్లాడుతూ.. మంత్రి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మైనారిటీ ప్రజలకు రెండు పథకాలకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు :
9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944